# కడుపు మంట!

ట్రింగ్ - ట్రింగ్...ట్రింగ్-ట్రింగ్...ట్రింగ్

"హలో, మూర్తి స్పీకింగ్,"

"హలో"

"హలో, మూ...."

"హలో! హైద్రాబాదు నుంచి కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఎన్ని గంటలకు వస్తుంది? ఏమన్నా లేటుందా?"

"కృష్ణా ఎక్స్‌ప్రెస్ హైదరాబాదు నుంచి రాదనుకుంటానండి."

"అదేంటి? కేన్సిల్ అయిందా? లేకపోతే ఏమన్నా ఏక్సిడెంటా?"

"అవ్వేమి కాదండి"

"మరెందుకు రాదు?"

"అది హైద్రాబాదు నుంచి కాదు. సికింద్రాబాదు నుంచండి వచ్చేది."

"ఎవరయ్యా నువ్వు? జోకులెయ్యడానికి కూర్చున్నావా అక్కడ? లేకపోతే రైళ్ళు ఎప్పుడొస్తాయో చెప్పడానికి కూర్చున్నావా?"

"ఎందుక్కూర్చున్నానో చెప్పుకోండి చూద్దాం?"

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్? ఒళ్ళేమన్నా తిమ్మిరి తిమ్మిరిగా వుందా? ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?"



"అసలు మీరెవరితో మాట్లాడుతున్నారో తెలుసా? ఇది రైల్వే ఎంక్వయిరీ కాదు. లారీ ఆఫీసు. అవతలివైపు నుంచి అసలు ఎవరు మాట్లాడుతున్నారో, ఏం మాట్లాడుతున్నారో అది రైట్ నెంబరా, రాంగ్ నెంబరా అని కూడా కనుక్కోకుండానే, వినిపించుకోకుండానే, ఆ రైలు ఎన్నిగంటలకు వస్తుంది, ఈ రైలు ఎన్ని గంటలకు వస్తుంది, ఎంత లేటుంది అంటూ సుత్తి కార్యక్రమాలు దంచే మీవంటి వాళ్ళని...."

"క్లిక్"

"అసలేం చెయ్యాలో తెలియడం లేదు. ఛస్తున్నాం ఈ వెధవ ఫోన్లతో! రోజుకి వంద ఫోనులు, ప్రాణాలు తీసేస్తున్నారు. మా ఖర్మ కాలి ఆ రైల్వే నంబరూ, మా నంబరూ...

(అవతలాయన పెట్టేసి చాలా సేపయింది. అయినా ఈయన... ఇదే కడుపు మంట... అంటే).